
# కాగితపు పులి - శాంతి



**ఆ ఆఫీసులో పనిచేసే గుమాస్తా నరసింహం మొహం జేవురించి వుంది. సరిగ్గా గంట క్రితం జరిగిన సంఘటన గుండెల్లో దిగిన ఈత ముల్లులా అతన్ని బాధిస్తూ వుంది.**

"నేను యూనియన్ నాయకుడు కాగానే 'రూల్స్' గుర్తు కొచ్చాయా యీ మేనేజరు గాడికి? ఇంతకు ముందున్న బ్రాంచి సెక్రెటరీ లందరూ ఈ పదవిలో వుండి బాగా ఎంజాయ్ చేశారని నాకు తెలియదను కున్నాడా? నా ఒక్కడి విషయంలోనే అభ్యంతర మొచ్చి పడిందా?..." ఉక్రోషంతో అతని ముక్కు పుటాలదిరాయి.

గంట క్రితం జరిగిన సంఘటన ఏమనగా...

గతంలో బ్రాంచి సెక్రటరీలు దాదాపు ప్రతిరోజూ 'లంచ్' అవర్‌లో ఇంటికెళ్లిన తరువాత తిరిగి ఆఫీసుకు రావడమనేది జరిగితే అద్భుతం జరిగిందనుకోవాలి. యూనియన్ పనులు చూసుకోవడాని కోసం, బ్రాంచి సెక్రటరీ, బ్రాంచి మేనేజరుల మధ్య ఉన్న చిన్న అండర్‌స్టాండింగ్ అది. క్రమంగా అది అలవాటై సాంప్రదాయంగా మారి, హక్కుగా మారిపోయింది.

సదరు హక్కును కొత్తగా బ్రాంచి సెక్రటరీ అయినటువంటి నరసింహం కూడా ఉపయోగించు కొన్నాడు మొదటిసారిగా. ఆ రోజు లంచ్‌కెళ్లిన నరసింహం తిరిగి ఆఫీసుకు రాలేదు. మరుసటి రోజు యథాప్రకారం ఉదయం ఆఫీసు కొచ్చాడు అర్థగంట లేటుగా. కాచు క్కూర్చున్న బ్రాంచి మేనేజరుగారు "ఏమండీ నరసింహం గారూ! నిన్న మధ్యాహ్నం గైర్హాజరైనారు. ఈ రోజు అర్థ గంట లేటు. పైగా మీరు బ్రాంచి యూనియన్‌నాయకులు. నాయకుడనేవాడు పంక్చువాలిటీ పాటించడంలో ఆదర్శంగా వుండాలి కాని, ఆఫీసుకు గైర్హాజరై, లేటుగా రావడంలో కాదు. బాధ్యత తెలియాలండీ, బాధ్యత. ఈసారికి వదిలేస్తున్నాను. ఇంకోసారిలా జరిగితే మీమీద చర్య తీసుకోవాల్సొస్తుంది' అనేది చరచరా అక్కడి నుండి వెళ్లిపోయారు మేనేజరు గారు.

లిప్త పాటు అక్కడి కాలం స్తంభించింది.

ఆ లిప్త కాలంలోనే, సీరియస్‌గా పని చేసుకొంటున్న స్టాఫ్, కష్టమర్లు ఆ దృశ్యాన్ని తిలకించి తిరిగి తమ తమ పనుల్లో మునిగిపోయారు. అలా తిలకిస్తున్నప్పుడు వారి వదనాలలో ప్రస్ఫుటమైన హేళనా భావం నరసింహం దృష్టిని దాటిపోలేదు.

చిన్న స్పార్కుకు భగ్గున మండిన గ్యాస్ స్టవ్ మంటలా అతని గుండె అవమాగ్నితో ప్రజ్వరిల్ల సాగింది. నరసింహం జీవిత కాలంలోనే అంతటి అవమానం పొందలేదు.

"యూనియన్ నాయకుడని చూడకుండా నోటి కొచ్చినట్లల్లా పేలుతాడా ఈ మేనేజరు? నన్ను గురించి ఏమనుకుంటున్నాడో ఏమో? ఏదో విధంగా మేనేజరు మీద దెబ్బతీయకపోతే నాకు మనశ్శాంతి ఉండదు. సమయం రానీ నాతడాఖా చూపిస్తాను".

దెబ్బతిన్న పులై పోయాడు నరసింహం.

సీటులో అసహనంగా కదులుతూ "మేనేజరు క్కావలసింది పంక్చువాలిటీని పాటించడమా? లేక పని చేయించుకోవడ మా? ఏది? పంక్చువాలిటి మాత్రమే పాటించాలని అతని ఉద్దేశ్యమే అయితే అలాగే కానీ. బ్రాంచి సెక్రటరీ సహకారం లేకుండా సిబ్బంది చేత ఎలా పని చేయించుకుంటాడో అదీ చూస్తాను. హు! గుర్రాన్ని బలవంతంగా నీటి మడుగు వద్దకు తీసుకెళ్లినా బలవంతంగా దానిచేత నీటిని తాగించడం సాధ్య కాదని అతనికి తెలియదు. పిచ్చి మేనేజరు. ఇం సీనియర్ మేనేజరై ఉండీ, యూనియన్ నాయకుడి మంచి చేసుకొని, సామరస్యంగా, సుహృద్భా వాతావరణంలో సిబ్బంది చేత పని చేయించుకొని మం ఫలితాలు సాధించచ్చని ఇంగితం తెలియని చాదస్తుడ

సరే ఏం చేద్దాం? ఎవరి కర్మ కెవరు బాధ్యులు? ఇక ప్రతి క్షణం అతనికి అశాంతే. ప్రతి పనీ పెండింగే. పది గంటలకు ఖచ్చితంగా వచ్చి, సాయంత్రం అయిదు గంటల తరువాత లెడ్జర్లు ముట్టుకోకూడదని, పట్టుకోకూడదని స్టాఫ్ (యూనియన్ మెంబర్లు) కు కట్టడి చేయాలి. వీలైనంత వరకూ పని పెండింగ్ పెట్టమని చెప్పాలి. అప్పుడు తెలుస్తుంది నా తడాఖా ఈ మేనేజరు గాడికి".

జరిగిన అవమానం అతన్ని అగ్నిలా దహిస్తుండగా 'ఎకనామిక్ టైమ్స్' పేపర్ తీసుకొని క్రమక్రమంగా అందులో మునిగిపోయాడు. తదేక దీక్షతో పేపర్లోని షేర్ కొటేషన్లని స్టడీ చేయసాగాడు. అయినా అతడు మనసును పేపరు మీద లగ్నం చేయలేక పోయాడు. ఆఫీసు కొచ్చే ముందు జరిగిన విషయం అతని కళ్లముందు సినిమా రీలులా తిరుగుతూంది.

"నోబుల్ డస్ట్ కంపెనీ షేరు సర్టిఫికేట్లు వచ్చి నాలుగు రోజు లైందండీ నరసింహం గారూ! నిన్న మధ్యాహ్నం మీ కోసం మీ ఆఫీసుకు ఫోన్ చేస్తే మీరు లేరని మీ బ్రాంచి మేనేజరు గారు చెప్పారు. ఇవి గోండి సర్టిఫికేట్లు' అని షేర్ సబ్ బ్రోకరు నక్షత్రరావు టేబుల్ సొరుగు నుండి వాటిని పైకి తీసి నరసింహం ముందుకు తోశాడు. గోల్డ్ కలర్ లెటర్సుతో అందంగా ముద్రించబడున్నాయ్ షేర్ సర్టిఫికేట్లు. "నాగుబాము పడగ కూడా అందంగా వుంటుంది కదూ!" ఆ ఊహ రావడం తోటే నరసింహం బెదిరిపోయాడు షేర్ సర్టిఫికేట్ల వంక చూడగానే.

"పదకొండు వేలా తొమ్మిది వందలా పది రూపాయలు" నరసింహం ఎంత మొత్తం 'డ్యూ' ఉన్నాడో చెప్పాడు నక్షత్రరావు. నరసింహం దగ్గర అంత డబ్బుంటే సమస్యే లేదు. అందుకే నరసింహం బెదిరిపోవడం.

"సుమారు లక్ష రూపాయలు పోగుచేసి రూపు మద్రాసు షేర్ బ్రోకర్‌కు పంపాలి. 'షేర్స్' ఇండెంట్ చేసిన వారందరూ రేపు ఎమౌంట్ సెటిల్ చేస్తామని చెప్పారు. దయచేసి మీరు కూడా రేపటి లోగా సెటిల్ చేస్తే మంచిది. ఈ రోజు సాయంత్రం లోపలైతే ఇంకా మంచిది".

రేపటి వరకూ గడువిచ్చి, నెల రోజుల గడువిచ్చినంత ఉదారంగా నక్షత్రరావు మాట్లాడుతుంటే నరసింహం ఒళ్లంతా కారం పూసినట్లైంది. ఒక వారం రోజులు గడువిమ్మని అడుగుదామనుకొని, తరువాత అడిగీ లేదనిపించుకొని తన 'ప్రిస్టేజీ' నెందుకు పోగొట్టు కోవాలనుకొని ఆఆలోచనను విరమించుకొన్నాడు. కనీసం ఒక రోజైనా గడువు దొరికిందని తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు. అప్పటికి గండం గడిచింది.

"అలాగే" అంటూ షేర్ సర్టిఫికేట్లను హ్యాండ్ బ్యాగులో కుక్కి, గాంభీర్యాన్ని ముఖానికి దట్టంగా అద్దుకొని ఉసూరుమంటూ బయట పడ్డాడు నరసింహం.

"పదకొండు వేలా తొమ్మిది వందలా పదిరూపాయలు నా దగ్గరుండుంటే అప్పటికప్పుడు చెక్ రాసి వాడి మొఖాన కొట్టుండే వాడిని" గాఢంగా నిట్టూర్చాడు.

"డిప్లమేటిక్‌గా మాట్లాడానను కొంటున్నాడేమో నక్షత్రరావు. ఎంత కట్‌త్రోట్‌గా మాట్లాడినాడని? ఎవరైనా, తనకు చుట్టూ అప్పులున్నాయిని, బ్యాడ్ అండ్ డౌట్‌ఫుల్ కేసని, నక్షత్రరావుతో గానీ అన్నారా? ఇడియట్స్ వాళ్లకేమి పనుల్లేవా ఇంతకంటే?" నరసింహం ముక్కు పుటాలదిరాయి.

మోయాల్సిన పెద్ద సంసార భారం నరసింహం నెత్తిమీదుండడం, అవసరాన్ని మించిన హోదా వెలగబెట్టాల్సి రావడం, 'ఫ్రెండ్స్ సర్కిల్' లోచిక్కి అడపాదడపా 'మందు'కు అలవాటు పడడం నరసింహాన్ని మొల లోతు అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేశాయి. ఆ ఊబి నుండి ఎలా బైట పడడమా అని మథన పడుతున్న విపత్కర పరిస్థితుల్లో సెకెండరీ షేర్ మార్కెట్ అతన్ని ఆకర్షించింది. ఆ బిజినెస్‌లో కొలీగ్స్ లాభ పడడం చూసి నరసింహంలో ఆశ మొలకెత్తింది.

ఆ తరుణంలో నోబుల్ డస్ట్ కంపెనీ షేర్లకు మంచి డిమాండు ఉందనీ, రెండు మూడు నెలల్లోపల వాటి ధర అనూహ్యంగా పెరిగిపోతుందని అతడి కొలీగ్స్ షేర్స్ బుక్ చేసుకోవడం చూసి, నానా తిప్పలు పడి అడ్వాన్సు సొమ్ము నామమాత్రంగా చెల్లించి రెండు వందల షేర్లకు ఇండెంట్ చేయించాడు. అతని కొలీగ్స్ మిగులు సొమ్ముతో బిజినెస్ చేస్తే నరసింహం వడ్డీలకు అప్పు తెచ్చి షేర్స్ కొనాలనుకున్నాడు. లేని కోర్కెలతో పైకెగరాలని ప్రయత్నిస్తూ అప్పుల ఊబిలోని కింకా లోతుకు కూరుకు పోసాగాడు. మొండి ధైర్యంతో షేర్స్ ఇండెంట్ చేయగలిగాడు గానీ షేర్ సర్టిఫికేట్లు డెలివరీ అయితే డబ్బెలా సర్దుబాటు చేయాలో నరసింహానికి కర్థం కాలేదు.

అతనికి అప్పు మరి పుట్టలేదు.

"తప్పదు, ఏదో ఒకటి చేసి, రేపటిలోగా ఆ నక్షత్రరావు మొహాన డబ్బు విసిరి కొట్టాలి". రోషం, బాధ కలగలిసిన ఒక దీర్ఘ నిశ్వాసం వదిలాడు నరసింహం.

ఏదైనా అద్భుతం జరిగితేనే గానీ నరసింహకు డబ్బు దొరకడం సాధ్యం కాదు.

బుర్రలో ఆలోచనలు గిర్రున తిరుగుతుండగా, టీవీయస్‌ను రివ్వున పోనిస్తున్నాడు. అప్పటికి సమయం పదిన్నరయింది. పది గంటలకే ఆఫీసులో ఉండాలి తను. అర్థ గంట లేటు.

"ఆ, అర్థ గంటే కదా లేటు. ఇందువల్ల కొంపలేవీ అంటుకుపోవు. పైగా నేనున్నది స్టేటుమెంట్లు తయారుచేసే డిపార్టుమెంటులో. నా కోసం కష్టమర్లెవరూ కాచుకొని ఉండరు. అదీగాక నేను బ్రాంచి సెక్రటరీని. నన్ను ప్రశ్నించే ధైర్యం ఎవరికుంది? మేనేజరుకా? హు! ఇక రేండే రెండు నెలల్లో రిటైర్ అయిపోయే మేనేజరు అలా నన్నడగ్గలడా? అని తనలోని గిల్టీ కాన్షస్‌నెస్‌ను, అతనిలోని యూనియన్ నాయకుడనే అహంభావంతో దాచుకోవాలని ప్రయత్నిస్తున్నాడు.


గమ్యం వచ్చింది. మోపెడ్ పార్క్ చేసి ఆఫీసులో అడుగు పెట్టిన తరువాత నరసింహం అనుకున్న దానికి విరుద్ధంగా జరిగి అవమానం పాలయ్యాడు.


★ ★ ★

నరసింహం ముందున్న టేబుల్ మీదొక కాగితం పేపర్ వెయిట్ క్రింద నలుగుతూ దిక్కూ మొక్కులేని అనాథలా పైన తిరుగుతున్న ఫ్యాను గాలికి అల్లాడుతూ ఉంది.

ఆ కాగితంలోని సారాంశమిది.

"మన సంస్థ మూడు సంవత్సరాలుగా నష్టాలతో నడుస్తూ వుంది. నష్టాల నుండి బయట పడడానికి ప్రభుత్వం, తగిన క్యాపిటల్ ఫండ్‌ను సమకూర్చడం ద్వారా ఒక అవకాశం యివ్వదలచుకొంది. అందుకు మన సంస్థ ఒక అవగాహనా పత్రం మీద సంతకాలు చేయడం జరిగింది. దరిమిలా మన సంస్థ గురించిన వివరాలు అర్జెంటుగా సమర్పించవలసి వుంది. కాబట్టి ఇందులో జతపరచబడిన ప్రొఫార్మా ప్రకారంగా వివరాలు పంపించవలసినదిగా కోరడమైనది. అట్లు పంపించక






ఉదాసీన వైఖరి ప్రదర్శించినచో సంబంధిత అధికారుల మీద చర్య తీసుకోబడుతుంది''.

దేశ వ్యాప్తంగా వున్న బ్రాంచీలన్నిటికీ అలాంటి ఉత్తరంతోపాటు కావాల్సిన ఫారాలు జతచేసి పంపించబడ్డాయి.

నరసింహం స్టేటుమెంట్లు తయారు చేయడంలో దిట్టం. 'స్టేట్‌మెంట్ల పులి' అని అతనికి పేరుంది. నరసింహం అనుకుంటే తప్ప అవి తయారై వెళ్లవు. ఇది నరసింహం డిపార్ట్‌మెంటు వర్క్. ఇతరులు జోక్యం కలిగించుకోరు.

నరసింహం ఒక విషపు నవ్వు నవ్వుకున్నాడు.

'స్టేటుమెంట్లు తయారు కావు. విషయం తీవ్రం కాబట్టి హెడ్ ఆఫీసువారు మేనేజరుని దూదేకినట్లేకుతారు' ఆ ఊహతో నరసింహంకు కొంచెం ఊరట కలిగి నట్లైంది. మేనేజరు మీదెలా దెబ్బకు దెబ్బ తీయాలో పరిష్కారం దొరకగానే అతని మనసు నక్షత్రరావు మీదికెళ్లింది.

"రేపటిలోగా నక్షత్రరావుకు పదకొండువేలా తొమ్మిది వందలా పది రూపాయలు ఎలా ఇవ్వడం?'' పెద్ద క్వశ్చన్ మార్క్ అతని మనోనేత్రం ముందు ఇనుప కొక్కెంలా వేలాడుతూ ఉంది. కొక్కెం కొన అతని గొంతులోనికి కసుక్కున దిగబోతున్నట్లుగా ఉంది. పరిపరి విధాలుగా అతని ఆలోచనలు పోతున్నాయి.

"షేర్ సర్టిఫికేట్ల నెవరికైనా అమ్మి వేస్తే?''......

ఊహు! వద్దు. షేర్స్ ఇండెంట్ చేసిన నాటికీ, ఇప్పటికీ షేర్ల రేట్లు బాగా పడిపోయాయి. ఇప్పుడమ్మితే నష్టాని కమ్ముకోవాల్సొస్తుంది. రెండు నెలలు ఓపిక పట్టితే ధరలు పెరగవచ్చు. తన అదృష్టం బాగుంటే ఎంతైనా లాభం రావచ్చు. తన దగ్గరున్న షేర్లు మంచి కంపెనీవి. మరేదైనా మార్గ మాలోచించాలి''.

దీర్ఘాలోచనలో ఉన్న నరసింహం మనసులో ఆలోచనలు ప్రవాహంలా సాగుతున్నాయి. అతని సమస్యకు పరిష్కారం లభించలేదు. చివరకు వెన్ను జలదరింప జేసే ఆలోచనవొచ్చింది.

"ఎవరి అక్కౌంటులోనైనా ఫ్రాడ్ చేస్తే?''

ఆ ఆలోచనకే చలి జ్వరం వచ్చినట్టు అతను వొణికి పోయాడు.

"ఛ ఛ! నాకిలాంటి ఆలోచన్లొస్తున్నా యేమిటి?'' అని అదుపు తప్పిన గుర్రంలా కదను తొక్కుతున్న అతని మనసును అధీనంలోనికి తెచ్చుకున్నాడు.

వచ్చే జీతంతో జీవితాన్ని, సంతృప్తి పరచుకొనుంటే అతనికీ విపత్కర పరిస్థితి వచ్చేది కాదు... అతని మదిలో అశాంతి రేగి ఉండేదీ కాదు.

"మిమ్మల్ని మేనేజరు సారు పిలుస్తా వుండారు''.

అటెండరు మాటలతో ఈ లోకానికొచ్చాడు నరసింహం కబురు తెచ్చిన తనవైపు విసుగ్గా చూసి "వస్తానని చెప్పు'' అని నిర్లక్ష్యంగా అనేసి టేబుల్ మీద పరచుకొన్న పేపరుని నింపాదిగా మడతలు సరిచేసి, దాన్ని యథాస్థితిలో ఉంచి, టేబుల్ డ్రాయర్ లాక్ చేసుకొని లేచి టాయ్‌లెట్ వైపు దారి తీశాడు. "మేనేజరు గారు పిలిచిన వెంటనే వెళ్లితే ఎంత నామోషీ కావాల్సినంత సేపు ఆలస్యం చేయడమే అతని ఉద్దేశ్యం. టాయ్‌లెట్‌లో కెళ్లి ముఖం మీద ఇన్ని నీళ్లు చల్లుకొని కర్చీఫ్‌తో మొహం తుడుచుకున్నాడు. టాయ్‌లెట్ నుండి బయటి కొచ్చి, ఆఫీసును మొత్తం పరికించాడు.

పన్నెండు మంది క్లర్కులలో ముగ్గురు లీవులో వున్నారు. మిగతా వారే లీవులో వున్న వారి పని కూడా నెత్తి మీదేసుకొని చకచకా పని చేస్తున్నారు. అది చూసి నరసింహం కోపం నషాళానికెక్కింది.

"హు! మేనేజరు మాటలకు లొంగి పోయి వెట్టి చాకిరీ చేస్తున్నారు. వాళ్ల పని వాళ్లు చేసుకోక లేనివాళ్ల పనిని కూడా ఎందుకు నెత్తి మీదేసుకోవాలో? అది మేనేజరు హెడ్డేక్. పని చేయించుకొనేంత వరకే మంచి మాటలాడతాడు. పని కాస్తా పూర్తయిన తరువాత సిబ్బంది కష్ట సుఖాలనూ, సాధక బాధకాలను అసలు పట్టించుకోదీ మేనేజిమెంటు. వీళ్లకు సాయంత్రం మీటింగ్ పెట్టుకొని చెప్పాలి - నిబంధనల మేరకే పని చేయాలనీ, అయిదు గంటల తరువాత ఒక్క నిముషం కూడా ఎక్కువ పని చేయరాదనీ''. ఇలా అనుకుంటూ మేనేజరు క్యాబిన్ లోనికి ప్రవేశించాడు నరసింహం మెల్లగా ప్రవహిస్తున్న లావాలా.

ఫోన్లో మాట్లాడుతున్న మేనేజరు గారు తన కేబిన్ లోనికి ప్రవేశించిన నరసింహంను చూసి 'కూర్చో' మన్నట్లుగా కళ్లతో సైగ చేశారు. మేనేజరుగారెదురుగా కూర్చున్న నరసింహం మేనేజరు గారు ఫోన్లో సంభాషణ ముగించే వరకూ ఏమి చేయాలో తోచక అసహనంగా సీలింగ్ ఫ్యాను కేసి చూశాడు. మూడురెక్కలు గల ఫ్యాను గిర్రున తిరుగుతూ ముప్పై రెక్కలతో కనబడు తూంది- తలలో తిరుగుతున్న అతని ఆలోచనల్లాగే.

కొంతసేపటికి మాట్లాడటం ముగించిన మేనేజరు గారు ఫోను క్రెడిల్ చేసి నరసింహం వైపు సాలోచనగా చూస్తూ "మిష్టర్ నరసింహం'' అని గొంతు సవరించు కున్నారు.

"ఊ, వింటున్నాను చెప్పమన్న''ట్లుగా నిర్లక్ష్యంగా తలెగ రేశాడు నరసింహం.

"నన్ను గౌరవించని వాడివి నేనెందుకు గౌరవించాలి?' తనపై అధికారి, వయసులో తనకన్నా ఇరవై యేళ్ల పెద్దవాడైన మేనేజరు మీద అతను ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య అవిధేయ వైఖరిని ఆ విధంగా సమర్థించుకొన్నాడు నరసింహం.

"చూడండి, చిన్న మొలక ఎదిగి శాఖోపశాఖలుగా విస్తరించి మహా వృక్షమైనట్లుగా, ఒక చిన్న పల్లెలో, చిన్న గదిలో ఊపిరి పోసుకొని అంచెలంచెలుగా పిగ్మీ స్థాయి నుండి జెయింట్ స్థాయి వరకూ మహోన్నతంగా ఎదిగి ఎందరికో ఆశ్రయమిస్తూ ప్రజాసేవ చేస్తున్న మన సంస్థ కొన్ని నెలల క్రితం దాకా అతి పెద్ద ఆర్థిక సంస్థల్లో ఒకటిగా నిలిచింది. ఎందరో నిస్వార్థ కృషి, త్యాగాల ఫలితంగా, ఆకాశమే హద్దు అన్నట్లుగా ఎదిగిన మన సంస్థ ఇప్పుడు.....''

మేనేజరు గొంతు గాద్గదికమై మాటలు పెగల్లేదు.

ప్రాణాధికంగా ప్రేమించే ఇంటి యజమాని తీవ్ర అస్వస్థతకు గురై మంచాన పడుంటే దుఃఖం ఆపుకోలేని ఆత్మీయ, విశ్వాసపాత్రుడైన సేవకుడిలా వున్నారు మేనేజరు. ముప్పై ఏళ్లుగా సంస్థతో పెనవేసుకున్న గాఢానుబంధం మాయనిది. ఇన్నేళ్లూ సంస్థను తన స్వంతమని భావించి దాని అభివృద్ధికి కృషి చేశారు.

కంపించిన వీణా తంత్రుల్లా గొంతు వణకుతుండగా మంద్ర స్థాయిలో మేనేజరు తిరిగి చెప్పడం కొనసాగించారు.

"కారణాలేవైతేనేం? ఈనాడు మన సంస్థ చిక్కుల్లో పడి, తాత్కాలికంగానే, - సిక్ అయింది. మళ్లీ మన సంస్థకు పూర్తి ఆరోగ్యాన్ని చేకూర్చి, గత వైభవంతో కళకళలాడేలా చేయాలని యాజమాన్యం నడుం కట్టింది. ఈ అసాధారణ పునరుద్ధరణ కార్యంలో మన వంతు కృషి మనం చేయడం మన ధర్మం. అది మన బాధ్యత కర్తవ్యం. సంస్థను కాపాడుకోవడమంటే మనల్ని మనం కాపాడుకోవడమే''. కాస్సేపు ఆగారు మేనేజరు గారు

"ఈ సోదంతా నాతోనే ఎందుకు చెబుతున్నట్టో? నా వద్ద పెండింగ్‌లో వున్న స్టేటుమెంట్లు వెంటనే ప్రిపేర్ చేసి పంపించమని చెప్పడానికేనా ఈ డొంక తిరుగుడు వ్యవహారం? హెడ్డాఫీసు నుండి రాబోయే ఛార్జి షీటును తలచుకొని గుండెల్లో రైల్లు పరుగెడుతున్నయేమో?! ఒక యూనియన్ నాయకుని హక్కును నిర్దాక్షిణ్యంగా కాల రాచి నపుడు ఇవన్నీ ఆలోచించలేదా? అయినా ఇతడి పిచ్చిగానీ స్టేటుమెంట్లు పంపించినంత మాత్రన నష్టాలు వూడుకుపోతాయా? పేరుకు పోయిన బకాయిలను సక్రమంగా వసూలు చేస్తే చాలు. సంస్థ నష్టాల నుండి బయట పడుతుంది. రోగ మొకటైతే మందొకటా? ప్రభుత్వం నుండి లభించే ఆర్థిక సహాయం ఊత కర్రల్లాగా పనిచేస్తుందే గానీ శాశ్వతంగా సమస్యలు పరిష్కరించదు. సంస్థ సిక్ అయిందంటే ఎవరు కారణం? నేనా? అలాగే భావిస్తున్నట్లుంది ఈయన. కాకుంటే ఇవన్నీ నాతో చెబుతున్నడేమిటి?" ప్రశ్నల పరంపరలు అతని మెదడు సుడులు తిరుగుతున్నాయి.

నరసింహానికి మాట్లాడ్డాని కవకాశం దొరకడం లేదు.

"మీకు తెలుసు, నేను రెండు నెలల్లో రిటైరవబోతున్న సంగతి. రిటైరవబోతున్నాను కదాని నా డ్యూటీ నేను సక్రమంగా చేయకుంటే సంస్థకు ద్రోహం చేసినట్లుకాదా? సంస్థకు ఏదో చేయాలని దీన్ని కాపాడాలనే తపన నాలో వుంది. నేనొక్కణ్ణి, అదీ రెండు నెలల్లో సంస్థ నొదిలిపోవాల్సిన వాడినీ, ఏం చేయగలను? ఇంకా ఎన్నో ఏళ్ల సర్వీసు చేయాల్సి ఉన్న మీలాంటి యువకులే పడిపోబోతున్న సంస్థను మీ భుజస్కంధాల మీద మోసి నిలబెట్టగలరు'

మేనేజరు గారి కళ్లల్లో లీలగా తడి మెరుస్తూంది.

నరసింహం కూడా మౌనంగా వుండి పోయాడు.

మేనేజరు గారే నిశ్శబ్దాన్ని భంగం చేశారు.

"మిమ్మల్నెందు పిలిపించానో చెప్పలేదు కదూ!" అని టేబుల్ సొరుగు నుండి నాలుగైదు పేజీలు ప్రింటెడ్ సర్క్యులరూ, దానితో జత చేయబడ్డ కొన్ని పెద్ద పెద్ద షీట్లు పైకి తీశారు మేనేజరు గారు. ఆ షీట్లపైన నిలువుగా, అడ్డంగా కాలమ్స్ ముద్రించబడున్నాయి. అనాసక్తంగా వాటివైపు చూసి "ఏవో కొత్త రకం స్టేటుమెంట్లయి వుంటాయి" అని నిర్ధారించేశాడు నరసింహం.

పైకి తీసిన షీట్లను నరసింహంకు చూపిస్తూ మేనేజరు గారిలా చెప్పారు.

"కొద్దికాలం క్రితం మేనేజిమెంటుకూ, యూనియన్‌కూ మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందంలో కొన్ని అనామలీస్ చోటు చేసుకున్నాయనీ, కొద్ది మేరకు అన్యాయం జరిగిందనీ యూనియన్ వాళ్లు అసంతృప్తి వ్యక్తం చేసి ఆందోళన సాగించడం జరిగిందని మీకు తెలుసు. ఆ ఆందోళన ఫలితంగా, అనామలీస్‌ను సరిచేయడాని కొప్పుకుంది మేనేజిమెంటు. అరియర్స్ చెల్లించమని హెడ్ ఆఫీసు వారిచ్చిన ఆర్డర్సు ఇవి".

ఆ మాట లర్థం చేసుకోవడానికి రెండు క్షణాలు పట్టింది నరసింహానికి. అర్థం కాగానే నిద్ర మొహం మీద నీళ్లు చల్లినట్లయింది. శరీరంలోని రక్తమంతా అతని మొహంలోనికి జివ్వున ఎగజిమ్మింది. 'అరియర్స్' అన్న మాటలు జున్నుపాలలా, తేనె జల్లులా, ఎడారిలో ఒయాసిస్సులా అనిపించా యతనికి.

"నిన్నటి దాకా వీడని చిక్కు ముడిలా బిగుసుకొని పోతున్న నా సమస్య ఇంత తేలిగ్గా పరిష్కరించబడుతుందనీ, ఉరుములు, మెరుపుల ఏలని వాన జల్లుల్లా వచ్చి పడతాయనీ నేనే మాత్రం ఊహించలేదు. ఓహ్! తనెంత అదృష్టవంతుడు! రెండు సంవత్సరాల అరియర్స్!..." నరసింహం స్వగతంగా అనుకుంటున్నాడు.

"కానీ..." మేనేజరు గారి గొంతు.

మధురాతి మధురమైన పాటను వింటున్నప్పుడు అకస్మాత్తుగా కరెంట్ పోయి టేప్ రికార్డర్ ఆగిపోతే కలిగేటటువంటి బాధ నరసింహంలో కలిగించాయి కానీ అన్న ఆ మాట.

"మేనేజరు ఏదో లిటిగేషన్ పెట్టదలచుకున్నాడు" భయపడ్డాడు నరసింహం.

"ఏమీ లేదండీ నరసింహం గారూ! అరియర్స్ ఎలా చెల్లించాలో గైడ్‌లైన్స్ మాత్రం హెడ్ ఆఫీసు వారు రూపొందించి పంపించారు. మేజర్ వర్కంతా బ్రాంచి లెవెల్లోనే చేయాల్సి ఉంటుంది. అదంత తేలిగ్గా పూర్తయే పని కాదనుకుంటాను. పైగా స్టాఫ్ మీదే పని ఒత్తిడి యెక్కువగా వుంది. వాళ్లనింకా ఒత్తిడికి గురి చేయడం బాగుండదు. తీరికగా, స్టాఫందరూ తిరిగి వచ్చాకే అరియర్స్ కాలిక్యులేషన్లు చేయొచ్చులెండి. అందునా గరిష్ఠ తేదీ కూడా చాలా ముందుంది. తొందరెందుకని నా అభిప్రాయం".

నరసింహం తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

"ఓ! అదన్న మాట మేనేజరుగారి అభ్యంతరం?" అని స్వగతంగా అనుకొని పైకి ఇలా అన్నాడు.

'అదేంటిసార్! అలా అంటారు? స్టాఫ్ మీద పని ఒత్తిడి ఎక్కువైందని ఎవరన్నారు? ఒకవేళ ఉన్నదే అనుకోండి. బయటి పనేమీ కాదు కదా! ఆఫీసు పని. అది చేసుకోవడానికి బరువనుకొంటే ఎలా? అయినా మనం రోజూ చేసే ఎనిమిది గంటల పనికి ఇంత జీతం ఎవరిస్తారు సార్? ఇన్నేళ్లపాటు మన సంస్థ అనే మహావృక్షపు నీడలో చల్లగా సేదదీరి, తీయటి పండ్ల నారగిస్తున్న మనం, ఈమాత్రం దానికే పని ఒత్తిడి ఎక్కువనుకుంటే ఎలా సార్? అది మనందరి కర్తవ్యం. అరియర్స్ కాలిక్యులేషను చేయడం, ఓచర్సు ప్రిపేర్ చేయడం, లెడ్జరు పోస్టింగ్సూ, స్టేటుమెంట్లు నింపి ట్యాలీ చేయడంద - ఇవన్నీ నాకు వదిలేయండి. స్టాఫ్ మెంబర్సు సహాయంతో ఈ రాత్రి ఎంత పొద్దుపోయినా సరే, రూపటికి అక్కౌంట్లన్నీ సిద్ధం చేసుంచే బాధ్యత నాది. ఆ పేపర్సిలా ఇవ్వండి'.

'మాట్లాడుతున్నది నరసింహమేనా?' అన్న అనుమానం వచ్చింది మేనేజరుకి. సమయానుకూలంగా పరిసరాల కనుగుణంగా రంగులు మార్చే ఊసరవెల్లి ఆయన మదిలో మెదిలింది. మాట ఎత్తితే హక్కుల గురించి పోట్లాడే నరసింహం సంస్థను మహావృక్షం, చల్లని నీడ, తీయని పళ్లు అని స్తుతించడం ఎందుకో అర్థమైంది. "హు! అవకాశవాది" అనుకొని మేనేజరు "అరియర్స్ విషయం సరే, మరి ఆ...." మాటను పూర్తి చేయలేదు.

"నాకర్థమైంది సార్. పెండింగ్‌లో ఉన్న స్టేటుమెంట్ల గురించే కదా మీరడగదలచుకొన్నది? అవి కూడా రేపటికి సిద్ధంగా ఉంటాయి" అని నరసింహం భరోసా ఇచ్చాడు. హెడ్ ఆఫీసు సర్క్యులరు, అరియర్స్ ఛార్టులు నరసింహం కందిస్తూ గుంభనంగా నవ్వుకొన్నారు మేనేజ గారు.

★ ★ ★

మసక చీకటి కారు చీకటిగా మారి చాలా సేపైంది. ఇద్దరు కొలీగ్స్ సహాయంతో గోదాలోనికి దిగిన వస్తాదులా అంకెలతో, లెడ్జర్లతో కుస్తీ పడుతున్నాడు నరసింహం. ఇంకా పని పూర్తి కాలేదు.

పది గంటలా పది నిమిషాలు చూపిస్తున్న గోడ గడియారపు ముళ్లు నరసింహం అసలు రంగు చూసి నవ్వుకొంటున్నాయి.

